# ఏడు దశాబ్దాల పైగా 'స్వాతంత్ర్యం'లో దేశ ప్రజాస్వామ్య నిజస్వరూపం

**ఆగష్టు** 15న ఎప్పటిలానే ఎర్రకోటపై మువ్వన్నెల జెండాను ప్రధాని ఎగురవేసి 72వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆర్భాటంగా ప్రారంభించారు. దాదాపు గంటన్నరపైగా దేశ ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్యమనబడే అధికారమార్పిడి జరిగిన గత 7 దశాబ్దాల పైగా కాలాన్ని పరిశీలిస్తే, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న మనదేశ ప్రజాస్వామ్య డొల్లతనం రోజురోజుకీ మరింత నగ్నంగా వెల్లడవుతోంది.

ఎలాంటి చట్టభీతీ లేకుండా భద్రతా, పోలీసు బలగాలు ప్రజాస్వామ్య, పౌర హక్కులను అన్ని స్థాయిలలో హరించి వేస్తున్నాయి. పదుల సంఖ్యలో ఎదురు కాల్పుల పేరిట హత్యలు, లాకప్ హత్యలు నిత్యం జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయటం లేదు, మానవహక్కుల కమిషన్ ఈ హత్యలకు గురైన బాధిత కుటుంబాలకు డబ్బు రూపంలో పరిహారాన్ని చెల్లించి తనను తాను విముక్తం చేసుకుంటున్నది. ప్రభుత్వాధికారపు దన్నుతోనున్న హిందూమతతత్వ శక్తులు, ప్రైవేటు సాయుధ మూకలు చట్టానికి కట్టుబడి వున్న అమాయక పౌరులను విచ్చలవిడిగా హత్య గావిస్తున్నారు. లౌకికవాదాన్ని ప్రభోధించేవారుగాని, లేదా తమ మతాన్ని తాము ఆచరించే స్వేచ్ఛకోసం, వాక్ స్వాతంత్ర్యం కోసం అడిగే వారెవరైనా దేశద్రోహులుగా ముద్ర వేయబడుతున్నారు. బలవంతపు భూసేకరణను, విస్థాపనను గ్రామల మునకను వ్యతిరేకిస్తూ, నిరసనకారులు శాంతి యుతంగా వూరేగింపులు నిర్వహించటాన్ని సైతం పాలకులు నిరాకరిస్తున్నారు. 'చెల్లింపు వార్తలు' 'బూటకపు వార్తలు' అధికార వార్తలుగా విహారం చేస్తున్నాయి. బడా బూర్జువా అధినేతలు కోరుకున్న వార్తలు మినహా, మరేమీ రాయడానికి విలేఖరులకు స్వాతంత్ర్యం లేదు. ఎప్పుడైనా చిన్న పత్రికల వారెవరైనా వాస్తవాలను వెల్లడిచేస్తే వారిని భౌతికంగా నిర్మూలిస్తున్నారు.

కేంద్రంలో అధికారంలోనున్న పాలకులు, రోజులు గడుస్తున్న కొలదీ అసహనాన్ని మరింత పెంచుతున్నారు. నిరసన గళాలను అణచి వేస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదులను సంతృప్తి పరిచేందుకు దేశ ప్రధానితో సహా పాలకనేత లందరూ ఈ కసరత్తులలో మునిగివున్నారు. ఐక్యరాజ్య సమితిలో అమెరికా ప్రతినిధి మరియు భారత సంతతికి చెందిన మహిళ అయిన నిక్కిహేలీ ఇటీవల తన భారతదేశ పర్యటన సందర్భంగా మాట్లాడుతూ పొరుగుదేశమైన ఇరాన్‌తో మనదేశం సంబంధాలను తగ్గించుకోవాలని, ఆ దేశం నుండి చమురు కొనుగోలును నిలిపి వేయాలని బాహాటంగా భారత ప్రభుత్వాన్ని కోరింది. మోడీ నాయత్వంలోని ప్రస్తుత కేంద్రప్రభుత్వం కూడా గత యుపిఎ పాలకులవలెనే అమెరికా వత్తిడులకు తలొగ్గి ఇరాన్ చమురు పైపులైను నిర్మాణం అంశంలో దేశ ప్రయోజనాలకు హానికరంగా ప్రవర్తిస్తోంది.

తన బాధ్యతలు నిర్వహించటం, సమావేశాలు జరగటం కంటే పార్లమెంటు సభ్యుల గందరగోళం, గొడవలే అధికంగా జరిగే మనదేశ పార్లమెంటు, బిజెపి ప్రభుత్వ అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు ఏకధాటిగా 14 గంటలపాటు సమావేశమైంది. తీర్మానం వీగిపోతుందనే ఫలితం వూహించినదే. సమాఖ్య స్వభావంగా చెప్పబడే భారత ప్రజాస్వామ్యంలోని మరో పార్శ్వం ఇప్పుడు విస్తృత చర్చనీయాంశంగా వుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన అనేకమంది పార్లమెంటు సభ్యులు పార్టీ రేఖలకు అతీతంగా కేంద్రప్రభుత్వాన్ని విమర్శించారు. కేంద్రప్రభుత్వం, రాష్ట్రాలకు ఇవ్వవలసిన నిధులను విడుదల చేయకుండా నిరాకరిస్తూ, తన చేతుల్లోకి అనేక అధికారాలను గుంజివేసుకోవడం వంటి చర్యలతో అన్యాయానికి పాల్పడుతోందని వారంతా ఆరోపించారు. అయితే, ఏ ఒక్కరూ కూడా కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమీక్ష చేయాలని డిమాండ్ చేయడానికి సిద్ధంగా లేరు.

భారతదేశ రాజకీయాలు, సంస్కృతుల అంశంతో భిన్నత్వంలో ఏకత్వమే పవిత్రమైన లక్షణమని పాలకపార్టీలు పొగిడినా, భారత రాజ్యాంగ సమాఖ్య స్వభావం గురించి అనంతంగా ప్రసంగించినా – ఆచరణలో ఇది అధికభాగం ఏకకేంద్ర దేశంగానే మిగిలిపోయింది. సంవత్సరాలు గడుస్తున్న కొలదీ అధికాధికంగా రాష్ట్రాల చేతుల్లోని అధికారాలన్నీ, కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకొంటున్నది. కేంద్రంలో ఏ పార్టీ లేదా ఏ కూటమి పాలనాపగ్గాలు చేపట్టినప్పటికీ కూడా, అది రాష్ట్రాల అధికారాలను దురాక్రమిస్తూనే వుంది. దీనికి తాజా ఉదాహరణ వస్తు, సేవలపన్ను-జిఎస్‌టి. రాష్ట్రాల చేతుల్లోవున్న పన్నులు వసూలు చేసుకునే అధికారాన్ని, జిఎస్‌టీ ద్వారా కేంద్రం గుంజివేసుకొని, ఆయా రాష్ట్రాలను కేంద్రం ముందు దేబిరించే వారిగా చేసింది. పన్నుల వసూలు ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశాన్ని కేంద్రం గుంజివేసుకొని, కేంద్రంపై ఎల్లవేళలా రాష్ట్రాలు ఆధారపడివుండే విధంగా చేసింది.

1980లలో కేంద్ర- రాష్ట్ర సంబంధాలు తీవ్ర రాజకీయ చర్చనీయాంశంగా ముందుకొచ్చినపుడు కేంద్ర ప్రభుత్వం దీనిపై పరిశీలన జరిపి నివేదిక రూపొందించేందకు సర్కారియా కమీషన్‌ను నియమించింది. కొద్దిపాటి ప్రయోజనం, ఫలితాలనిచ్చే స్వభావమున్నదైనప్పటికీ ఆ సర్కారియా కమిషన్ నివేదికను సైతం పాలకులు అటకపైకి ఎక్కించివేశారు. నరేంద్రమోడీ పదేపదే ప్రవచిస్తున్న, విస్తృత ప్రచారం చేసుకుంటున్న విధానం, రాష్ట్రాలపై ఏకపక్ష దాడులు జరిపేలా మారింది. వాస్తవాచరణలో రాష్ట్రాలు పెద్ద మునిసిపాలిటీల స్థాయిలో మిగిలిపోయాయి.

భారత రాజ్యాంగ సారం సమాఖ్య స్వభావం కలిగివుండేదని ప్రకటించుకుంటున్నప్పటికీ, అది వాస్తవం కాదు, భ్రమ మాత్రమేనని, భారతదేశం అభివృద్ధి చెందటానికి సంఘర్షణ పడుతున్న "వివిధజాతుల పాలిట బందిఖానా" అని సిపిఐ (ఎం.ఎల్) తన 'కార్యక్రమం'లో విస్పష్టంగా పేర్కొంది.

భారత ప్రజాస్వామ్యంలో మరో కీర్తించబడే అంశమైన ఎన్నికల విధానం కూడా పాలకవర్గాల దాడులకు గురవుతోంది. చాలాకాలంగా బిజెపి అధ్యక్ష తరహా పాలనగురించి ప్రచారం చేస్తోంది. ఇటీవల బిజెపి 'ఒకేదేశం – ఒకే ఎన్నిక" అనే నినాదాన్ని రూపొందించింది. రాజ్యంలో పేర్కొన్న పద్ధతి ప్రకారం అవసరమైనపుడు, అవసరమైన చోట ఎన్నికలు ఇంతకాలంగా నిర్వహించుకుంటూ వస్తున్న దానిని 'రాజ్యాంగ వక్రీకరణ' గా పేర్కొంటున్నారు. 'లా కమీషన్' దేశంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల అభిప్రాయాలను వింటున్నది. 'కార్య నిర్వాహక వర్గానికి అధినేత రాష్ట్రపతి' అంటూ నీతి ఆయోగ్ ఇటీవల ఓ ప్రతిపాదనను దౌర్జన్యయుతంగా ముందుకు తెచ్చింది. లోక్‌సభ రద్దును ఒకవేళ తప్పించ లేకపోతే, నూతనంగా సభ ఎన్నికయ్యేంత వరకూ రాష్ట్రపతి నియమించిన మంత్రిమండలి సలహాతో దేశాధ్యక్షుడు దేశపాలన సాగించాలని నిబంధనలు రూపొందిస్తున్నారు. సూత్రరీత్యా దీనిని అంగీకరిస్తే, రాష్ట్రాలు గవర్నరు పాలన కిందకు వస్తాయి.అంటే ఇది నామమాత్రపు ప్రజాస్వామ్యానికి కూడా సమాధిగా పరిణమిస్తుంది.

ఎర్రకోటపైనుండి మువ్వన్నెల జెండాను ఎగురవేసే పాలకులు, యధాప్రకారం తమనుతాము దేశ ప్రయోజనాల పరిరక్షకులుగా కితాబు లిచ్చుకుంటారు.

అయితే, వాస్తవికమైన స్వాతంత్ర్య, ప్రజాతంత్ర, సౌభాగ్యవంతమైన భారతదేశాన్ని రూపొందించుకోవాలంటే, జీవితకాల పోరాటాన్ని సాగించి, విజయం సాధించాలని, మనదేశ ప్రజలు గత ఏడు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న దోపిడీ, పీడన, అణచివేతల అనుభవాలు, వేదనలనుండి గుర్తిస్తున్నారు. వారు తప్పకుండా ఆ మార్గంలో సాగుతారు.

oooooo